సాక్షి నిజామాబాద్

బుధవారం । 22 । మార్చి । 2023



మనుగడకు చెట్లే ఆధారం

మానవ మనుగడకు చెట్లే ఆధారమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డైరెక్టర్ రామ్మూర్తి సోమ పేర్కొన్నారు.

- 8లో ▸



పరిహారంపై పట్టింపే లేదా..?

ప్రకృతి ప్రకోపానికి గురైన రైతన్నను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడం లేదు. వంట నష్ట పరిహారాన్ని అందించడం లేదు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.4 /21.4

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటి గాలులు వీచే అవకాశం ఉంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కవిత్వమే సమాజానికి వసంత హేతువు



నిజామాబాద్ సిటీ : కవిత్వమే సమాజానికి వసంత హేతువు అని ప్రముఖ కవి సభా సామ్రాట్ వీపీ చందన్‌రావు అన్నారు. మంగళవారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శ్రీ శోభకృత్ నామ ఉగాది 26వ ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా 'వసంతాన్ని పిలుద్దాం రా' శీర్షికన కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గౌరవ అతిథి ప్రముఖ కవి పంచరెడ్డి లక్ష్మణ్ మాట్లాడుతూ కవిత్వం, వసంతం మనిషి జీవితంలో ఉచ్వాస నిశ్వాసలుగా ఉండాలన్నారు. తెయూ తెలుగు అధ్యాపకురాలు త్రివేణి మాట్లాడుతూ మహిళలకు కవిత్వం, సాహిత్యం, ఆధునిక ఆయుధాలుగా పరిణమించాలయన్నారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ కవిత్వం, వ్యక్తిత్వం ఒకేవిధంగా ఉన్న కలం యోధులు సమాజానికి చైతన్య దీపికలవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్, గుత్ప ప్రసాద్, కాసర్ల నరేశ్, గంట్యాల ప్రసాద్, పద్మావతి, శంకర్ సింగ్, రమ శకుంతల, రమణాచారి, శ్రీరామ లక్ష్మణ్, గోపాల్, నాగరాజు, ఎలగందుల లింబాద్రి, దారం గంగాధర్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, శంకర్, సాయిబాబా కవితా గానం చేశారు. కవులకు ఉగాది పురస్కారాలతో సత్కరించారు.

పేపర్ లీకేజీలపై విచారణ చేయించాలి



నిజామాబాద్ నాగారం : టీఎస్‌పీఎస్సీ జరిగిన పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని జిల్లా కలెక్టర్‌కు నిరుద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విన్నవించారు. అన్ని పరీక్ష పత్రాలను మళ్లీ తయారుచేసిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలన్నారు. అప్పటివరకు ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు టి.క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి సతీష్, సభ్యులు కపిల్, రమేష్, రాజేష్, సాయికుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు 'పది' పరీక్ష పత్రాలు



ఖలీల్‌వాడి : పదో తరగతి ప్రశ్నాపత్రాలను విద్యాశాఖ అధికారులు, సబ్జెక్ట్‌ల వారీగా సెట్ చేసి నగరంలోని 1వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చుతున్నారు. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా ప్రశ్నాపత్రాలను సరిచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

క్వార్టర్స్‌కు నిఖత్



నిజామాబాద్ నాగారం : మహిళల వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఢిల్లీలో జరుగుతున్న బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నిఖత్ ప్రత్యర్థులను తన పంచులతో మట్టికరిపిస్తోంది. మంగళవారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మెక్సికోకు చెందిన క్రీడాకారిణి 5–0 తేడాతో ఓడించి క్వార్టర్స్‌కు చేరింది.

ప్రకృతి పండుగకు స్వాగతం



- నేడు 'శోభకృత్' నామ ఉగాది
- ఆరోగ్య ప్రదాయని.. షడ్రుచుల పచ్చడి ప్రత్యేకం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం కోసం విస్తృత ఏర్పాట్లు

శో–శుభం, భ–వెలుగులు నింపుతూ, కృత్–చేసే పనులయందు విజయం. ఇలా శుభంతో కూడుకున్న విజయాలను కలుగాలని కాంక్షిస్తూ శ్రీ శోభకృత్ నామ సంవత్సరానికి బుధవారం స్వాగతం పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.

మోర్తాడ్(బాల్కొండ): తెలుగువారి కొత్త ఏడాది ఉగాదిని ప్రతియేటా ఎంతో ప్రత్యేకంగా జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తుంది. ఆంగ్ల సంవత్సరానికి నిర్దీత వ్యవధి, నిర్దిష్టమైన తేదీలు, నెలలు ఉంటాయి. తెలుగు సంవత్సరానికి మాత్రం తిథి, వారం, నక్షత్రం, కరణం, యోగం మిలితమై ఉంటుంది. అందుకే ఉగాది అందరికి ప్రత్యేకమైన పండుగ. ఈ రోజున ఆలయాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

చంద్రుడిని అనుసరించి పండుగ

ఉత్తర భారతదేశంలో సూర్యున్ని అనుసరించి పండుగలను నిర్వహిస్తే, దక్షిణాది రాష్ట్రాల్లో చంద్రున్ని అనుసరించి పండుగలను జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తుంది. అందుకే ఏ శుభ కార్యానికి ముహూర్తం నిర్ణయించినా చాంద్రమాన అని ఆరంభిస్తారు. ఉగాదితోనే వసంత ఋతువు మొదలవుతుంది.

వగరు.. చేదు.. తీపి

ఉగాది పచ్చడికి ఎంతో ప్రాధాన్యత ఉంది. వగరు, చేదు, తీపి, పులుపు, కారం, ఉప్పు రుచులతో కలగలిపిన ఉగాది పచ్చడి సేవిస్తే మనిషి ఆరోగ్యం కుదుటపడుతుంది. కొత్తగా చేతికొచ్చిన మామిడి, వేప చిగురు, కొత్త కారం, కొత్త బెల్లం, ఉప్పు మిశ్రమంతో చేసిన పచ్చడిని సేవిస్తే మనిషి శరీరం వజ్రంలా తయారైతుందని చెబుతారు. మనిషి వందేళ్ల జీవించడానికి ఉగాది పచ్చడి దోహదపడుతుందని మనిషిలో ఉండే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాశ్చార్యాలను అదుపులో ఉంచే గుణం పచ్చడిలో ఉందని పెద్దలు వెల్లడించారు.

నవ్యతకు ఆరంభం ఉగాది

కామారెడ్డి అర్బన్: ఉగాది అనగానే నవ వసంతం రావడం చెట్లు చిగురించడం, పూత పూయడం, ప్రకృతిలో నూతనత్వానికి సూచనగా కనబడుతుంది. ఉగాది పండుగ సంవత్సరానికి తొలి రోజుగా సంబరంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుంది. ఉగాది పచ్చడి, బెల్లం పోలెలు అమృతంగా భావించి ఆరగిస్తారు. శోభకృత్ అంటే సంపదలు, ఆయురారోగ్యాలు శోభిల్లాలని కోరడమే.

– డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ, కవి



మార్కెట్లో మామిడి కాయలు, మామిడి కొమ్మల అమ్మకం

చారిత్రక సాక్ష్యాలు.. ఈ ఆలయాలు

- నాటి చరిత్రను సజీవంగా నిలబెట్టిన పెద్దరాంమందిర్, సారంగపూర్ హనుమాన్, రఘునాథ ఆలయాలు
- ఇందూరు జిల్లాపై ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు ముద్ర

ఇందూరు చారిత్రక సజీవ ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి నగరంలోని పెద్దరామమందిర్, సారంగపూర్ హనుమాన్, రఘునాథ ఆలయాలు.. 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు వీటిని నిర్మింప జేయించారు.





సారంగపూర్ హనుమాన్ ఆలయం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శ్రీ రాముడు, హనుమంతుడి భక్తుడైన సమర్థ రామదాసు 17వ శతాబ్దంలో నిర్మింపజేసిన ఆలయాలు.. ఇందూరు జిల్లా చెక్కుచెదరని చరిత్రను ఠీవిగా నిలబెడుతున్నాయి. మహారాష్ట్రకు ఆనుకుని ఉన్న ఇందూరు జిల్లాలో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ ప్రభావం ఎక్కువగా ఉంది. ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసుచే నిర్మితమైన నగరంలోని పెద్దరామమందిర్, సారంగపూర్ హనుమాన్ ఆలయం, సమర్థ రామదాసుచేత విస్తరించబడిన రఘునాథ ఆలయం గత చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. కాగా ఈ మూడు ఆలయాలకు, డిచ్‌పల్లిలోని రామాలయానికి అనుసంధానంగా భూగర్భంలో సారంగ మార్గాలు ఉన్నట్లు రఘునాథ ఆలయం గోడలపై సూచికలు ఉన్నాయి.

■ నగరం నడిబొడ్డున ఉన్న పెద్ద రామమందిర్‌ను 17వ శతాబ్దంలో సమర్థ రామదాసు నిర్మింపజేశారు. ఇక్కడ శ్రీరాముడు, హనుమాన్ మందిరాలు ఎదురెదురుగా ఉంటాయి. శ్రీరాముడి విగ్రహం పాదాల నుంచి సమాంతరంగా హనుమంతుడి తల భాగం ఉండేలా నిర్మాణం చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ప్రాంగణంలో ఉన్న కోనేరు ఆకట్టుకుంటుంది. ఇందులో గోశాల చక్కగా నిర్వహిస్తున్నారు. మఠాధిపతిగా 1632 నుంచి ఉద్ధవ్ స్వామి, 1656 నుంచి మాధవ్ స్వామి, 1687 నుంచి గోవింద్ స్వామి, 1725 నుంచి అనంత్ స్వామి, 1739 నుంచి నృసింహ స్వామి, 1754 నుంచి రామకృష్ణ స్వామి, 1778 నుంచి రామచంద్ర స్వామి, 1804 నుంచి జయరామ్ స్వామి, 1834 నుంచి ఆత్మారాం స్వామి, 1848 నుంచి వామన్ స్వామి, 1853 నుంచి రాజారాం స్వామి, 1866 నుంచి కేశవ్ స్వామి, 1904 నుంచి కల్యాణ్ స్వామి, 1905 నుంచి దినకర్ స్వామి 1983 నుంచి యశోజీ స్వామి మఠాధిపతులుగా ఉన్నారు. ఛత్రపతి శివాజీ ఈ ఆలయాన్ని సందర్శించారు.

■ సారంగపూర్ హనుమాన్ మందిరాన్ని సమర్థ రామదాసు 17వ శతాబ్దంలో బోధన్ రోడ్డులో 1,400 ఎకరాల్లో నిర్మింపజేశారు. ప్రస్తుతం ఈ ఆలయం భూములు అన్యాక్రాంతమైపోయాయి. తర్వాత కాలంలో ఇక్కడ సమర్థ రామదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఛత్రపతి శివాజీ ఈ ఆలయాన్ని సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది.

■ రఘునాథ ఆలయాన్ని గుట్టపై 914–928 సంవత్సరాల మధ్య రాష్ట్రకూట రాజవంశానికి చెందిన ఇంద్రుడు అనే రాజు 3,900 గజాల విస్తీర్ణంలో కోటను నిర్మించాడు. అదేవిధంగా ఇక్కడ 53 అడుగుల ఎత్తైన అఖండ శిలాధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. దీనిపై గరుడదీపం వెలిగిస్తే చుట్టుపక్కల ఊర్ల ప్రజలు దీపాలు వెలిగించుకునేవారు. కాగా రఘునాథుడనే మహర్షి ఖిల్లాలోని ప్రత్యేక సొరంగ మార్గం గుండా బొడ్డెమ్మ చెరువుకు వెళ్లి స్నానం చేసి వచ్చేవారని చరిత్ర చెబుతోంది. తరువాత 17వ శతాబ్దంలో సమర్థ రామదాసు శ్రీరాముడి ఆలయాన్ని నిర్మింపజేశారు. ఇక్కడ ధాన్యమందిరం నిర్మించారు. ఇందులో సమర్థ రామదాసుతో పాటు ఛత్రపతి శివాజీ సైతం ధాన్యం చేసుకున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు.



ఖిల్లా రఘునాథ ఆలయం



పెద్ద రామమందిర్



గోశాల



కోనేరు

కిరాయికి ఎడ్లబండ్లు..!

- కాడెద్దుల బండ్లకు పెరిగిన డిమాండ్
- ఉగాది నాడు ఆలయాల చుట్టూ ఊరేగింపునకు వినియోగం
- ఎడ్లబండ్లకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు చెల్లింపు



ప్రదర్శన కోసం సంగారెడ్డి నుంచి కామారెడ్డిలోని వాడి గ్రామానికి తీసుకువచ్చిన ఎడ్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఒకప్పుడు వ్యవసాయంలో కీలక భూమిక పోషించిన కాడెడ్లు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. ఆధునిక పద్ధతులు అందుబాటులోకి రావడంతో రైతులు ఎడ్లబండ్లను వీడి ట్రాక్టర్ల బాట పట్టారు. ఫలితంగా ఎడ్లబండ్ల ప్రాధాన్యత తగ్గిపోయింది. గ్రామాల్లో ఒకరిద్దరి వద్ద మాత్రమే ఎడ్లబండ్లు ఉన్నాయి. అయితే గ్రామాలలో జరిగే జాతరలు, ఇతర పండుగల సమయంలో గ్రామదేవతల ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన చేపడతారు. ముఖ్యంగా ఉగాదిరోజు జిల్లాలోని చాలా ప్రాంతాలలో ఆలయాల వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. కొన్నిప్రాంతాలలో ఎడ్లబండ్ల ప్రదర్శనకు సంబంధించి మొక్కుబండ్ల (హొక్కుబాపతి)కు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఎడ్లబండ్ల ప్రదర్శనకు ఎడ్లబండ్లు అందుబాటులో లేకపోవడంతో చాలాగ్రామాలలో భక్తులు ఎడ్లను, బండ్లను ఇతర ప్రాంతాల నుంచి అద్దెకు తీసుకువస్తున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో ఉగాది సందర్భంగా జరిగే జాతర ఉత్సవాలలో శ్రీ నల్లపోచమ్మ ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. మండలంలోని చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట, బంజర, లింగంపల్లి, గోలిలింగాల, మాల్తుమ్మెద, వదల్‌పర్తి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను తిప్పుతారు. దీంతో మండలంలో చాలామంది భక్తులు ఎడ్లబండ్లను ఇత ప్రాంతాల నుంచి కిరాయికి తెచ్చుకున్నారు. ఎడ్లు, బండ్లు కలిపి రూ.5వేల నుండి రూ.10వేల వరకు అద్దె చెల్లించారు. కొన్నిప్రాంతాలలో కేవలం ఎడ్ల జతకే రూ.5వేల నుండి రూ.8వేల వరకు చెల్లిస్తున్నారు.



యువతకు కౌన్సెలింగ్..

నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, నెహ్రూపార్క్ పరిసర ప్రాంతాల్లో 1వ టౌన్ పోలీసులు 'ఆపరేషన్ ఛబుత్ర' నిర్వహించారు. దీంట్లో భాగంగా సరైన పత్రాలు లేని బైక్‌లను పీఎస్‌కు తరలించారు. రాత్రివేళ పాన్‌దుకాణాలు, హోటళ్లను మూయించి వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు.

రోడ్డెక్కిన తపాలా బాధితులు



మోర్తాడ్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న తొర్తి పోస్టాఫీస్ ఖాతాదారులు, గ్రామస్తులు

- తొర్తి బ్రాంచ్‌లో అవినీతిపై ఫిర్యాదులు ఇచ్చినా స్పందించని ఉన్నతాధికారులు
- డబ్బులు రికవరీ చేయకపోవడంతో బాధితులకు అన్యాయం
- అధికారుల తీరును నిరసిస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో

మోర్తాడ్(బాల్కొండ) : తపాల శాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తమకు న్యాయం జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బాధితులు రోడ్డెక్కిన ఘటన మోర్తాడ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఏర్గట్ల మండలం తొర్తి బ్రాంచి పోస్ట్‌మాస్టర్‌గా వ్యవహరించిన వ్యక్తి అవినీతి, అక్రమాలకు పాల్పడినా ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై బాధితులు సందేహాలను వ్యక్తం చేశారు. అక్టోబర్ 2022లో తొర్తి బీపీఎం అక్రమాలను వెలుగులోకి తీసుకురాగా ఉన్నతాధికారులు కేవలం సస్పెన్షన్‌తోనే సరిపెట్టారని బాధితులు వెల్లడించారు.సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్ల రేపేణా ఉన్న ఖాతాదారుల సుమారు దాదాపు రూ.40లక్షలను బీపీఎం పక్కదారి పట్టిస్తే దీనిపై ఇప్పటికీ విచారణ పూర్తి చేయలేదని గ్రామస్తులు ఆరోపించారు. తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ సూపరెంటెండెంట్లు విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. తపాల శాఖ నిబంధనల ప్రకారం రూ. 50 వేలకు మించి అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు చేయాల్సి ఉంటుందని, కానీ తొర్తిలో రూ. 40 లక్షల వరకు అక్రమాలు జరిగితే అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని బాధితులు ప్రశ్నించారు. బీపీఎంతో ఉన్నతా ధికారులు లాలూచీ పడడంతోనే విచారణను పక్కదారి పట్టిస్తు న్నారని, ఖతాదారులు ఆరోపిస్తున్నారు బీపీఎం అవినీతి అక్రమాలకు పాల్పడటంతో పాటు కొంత మంది మహిళలను లైంగిక వేధింపులకు గురి చేశాడని తొర్తివాసులు ఆరోపించారు. బీపీఎం అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయకపోతే తపాల శాఖ జిల్లా ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

సోలార్ యూనిట్లకు సబ్సిడీ కోత

- 40 నుంచి 20 శాతానికి కుదింపు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : గ్రామీణాభివృద్ధి శాఖలో స్త్రీనిధి పథకం కింద మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్న సోలార్ యూనిట్ల సబ్సిడీ కోతకు గురైంది. సోలార్ కిట్ ఏర్పాటు చేసుకున్న వారికి రెడ్‌కో ద్వారా మొన్నటి వరకు 40 శాతం సబ్సిడీ ఇవ్వగా, దీనిని కేంద్ర ప్రభుత్వం 20 శాతానికి కుదించింది. ఈ నెల 15వ తేదీ నుంచి ఇది అమల్లోకి తేనున్నట్లు స్త్రీనిధి అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో జిల్లాకు నిర్దేశింపబడిన యూనిట్ల లక్ష్యంపై ప్రభావం పడే అవకాశముంది. సబ్సిడీ తగ్గడంతో మహిళా సంఘాల సభ్యులు సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అయితే, జిల్లాకు 1,210 యూనిట్లు కేటాయించబడగా, ఇప్పటి వరకు 100 యూనిట్ల ఏర్పాటుకు సభ్యులను గుర్తించారు. వీరికి 40 శాతం సబ్సిడీ వర్తించనుంది. కానీ, కొత్తగా ముందుకు వచ్చే వారికి మాత్రం 20 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. 1కిలో వాట్ సోలార్ యూనిట్‌కు రూ.21,320 ఉన్న సబ్సిడీ రూ.14,176కు కుదించారు. 2కిలో వాట్‌కు రూ.39,200 సబ్సిడీ ఉండగా, రూ.29,176కు చేశారు. 3కిలో వాట్‌కు రూ.57,360 ఉండగా, రూ.43,764కు తగ్గించారు. నాల్గవ కిలో వాట్‌కు రూ.65,240 ఉండగా, రూ.51,058కు తగ్గించారు. అలాగే ఐదవ కిలో వాట్ యూనిట్‌కు రూ.74,560 సబ్సిడీ ఉండగా, రూ.58,352కు కుదించారు.

ప్రజలకు కలెక్టర్, మంత్రి ఉగాది శుభాకాంక్షలు


మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. కలెక్టర్ హనుమంతు.. సీపీ నాగరాజు

సుభాష్‌నగర్/ఖలీల్ వాడి/నిజామాబాద్ నాగారం: రాష్ట్ర రోడ్లు భవనాలు,గృహనిర్మాణ, శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు మంగళవారం ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శోభకృత్ నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం బంగారు తెలంగాణగా రూపుదిద్దుకుంటోందన్నారు. అలాగే ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉగాది శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలిపారు. సీపీ నాగరాజు ఒక ప్రకటనలో జిల్లా ప్ర జలకు శోభకృత్ నామ ఉగాది శుభాకాంక్షలను తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే శాంతి భద్రతలు ముఖ్యమన్నారు. ప్రజలందరూ శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు జెడ్పీ చైర్మన్ దా దన్నగారి విఠల్ రావు ఒక ప్రకటనలో శోభకృత్ నామ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

నిజామాబాద్‌లో ఆపరేషన్ ఛబుత్ర


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

- 60 బైక్‌లు స్వాధీనం
- 150 మందికి కౌన్సెలింగ్ ఇచ్చిన ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలో సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 3గంటల వరకు పోలీసులు 'ఆపరేషన్ ఛబుత్ర' నిర్వహించారు. ఈసందర్భంగా ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, సౌత్ సీఐ జగదం నరేష్, నగర టౌన్ సీఐ వెంకట నారాయణ ఆధ్వర్యంలో బస్టాండ్, రైల్వేస్టేషన్, రాష్ట్రపతి రోడ్, గాంధీచౌక్, ప్రభు త్వ ఆస్పత్రి పరిసరా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. వాహనాల తనిఖీలు నిర్వహించి, సరైనా పత్రాలు లేని వాహనాలను ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రివేళలో హోటళ్లు, పాన్‌షాపులు, దుకాణాలను తెరిచి ఉంచిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 60 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకోగా, 150 మందికి ఏసీపీ కిరణ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. నగరంలో శాంతిభద్రతల కోసం ఆపరేషన్ ఛబుత్ర చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బైక్‌లకు సరైన పత్రాలను చూపిన వాహనాదారులకు అందజేశారు. గతంలో సీపీ కార్తికేయ ఉన్నప్పుడు నగరంలో ఆపరేషన్ ఛబుత్రలు నిర్వహించారు. ఏడాది తర్వాత మళ్లీ నిర్వహించడంతో గొడవలు తగ్గే అవకాశాలు ఉన్నట్లు ప్రజలు అంటున్నారు.

మానవ మనుగడకు వృక్షాలే ఆధారం

భిక్కనూరు: మానవ మనుగడకు చెట్లు ఆధారమని జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డు డైరెక్టర్ రామ్మూర్తి సోమ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో జియో ఇన్ఫర్‌మెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'ప్రపంచ నీటి దినోత్సవం- అడవులు, ఆరోగ్యం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవులకు కావల్సిన ఔషధాలను, వనమూలికలను ఇతర అవసరాలకు ఉపయోగ పడే వాటిని చెట్లు అందిస్తాయన్నారు. ప్రస్తుతం వాడుతున్న కాగితానికి బదులుగా డిజటల్ కాగితాలను వాడాలని సూచించారు. రీసైకిల్ చేసిన ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వటం వల్ల పర్యావరణ అనుకూల విధానాన్ని అవలంబించుకోవచ్చన్నారు. జీఐఎస్ టెక్నాలజీని ఉపయోగించి జియోట్యాగింగ్ ఏవిధంగా చేయాలో వివరించారు. నీటి వనరులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం సౌత్‌క్యాంపస్ ఆవరణలో మొక్కలను నాటారు. ప్రిన్సిపాల్ కవితా తోరస్, హెచ్‌వోడి సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డు డైరెక్టర్ రామ్మూర్తి సోమ

పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం



బాల్కొండ: ఇటీవల కురిసిన వడగళ్ల వానాల వలన దెబ్బతిన్న పంటల నష్టాన్ని ప్రభుత్వానికి త్వరలో నివేదిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) రాయుడు తిరుమల ప్రసాద్ అన్నారు. బాల్కొండ, మెండోరా మండలం బుస్సాపూర్‌లో మంగళవారం ఆయన నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. మక్క, నువ్వు పంటలు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో గ్రామాల్లో పంటలను పరిశీలించి, పంట నష్టాన్ని అంచన వేస్తామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. రైతులు వాతావరణకేంద్రం సూచన మేరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భీంగల్ ఏడీఏ మల్లయ్య, ఏవోలు రాజుకుమార్, మహేందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

రాజ్‌భవన్ ఉగాది ఉత్సవాల్లో తెయూ వీసీ



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన శోభాకృత్ నామ సంవత్సర ఉగాది ఉత్సవాల్లో తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌తో పాటు పలువురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. గవర్నర్ ఆహ్వానం మేరకు వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థులు దిలీప్ కుమార్, కరుణాకర్, జీవన్, గంగాధర్, అనిల్, నికేష్, మృణాలిని(యూనివర్సిటీ కళాశాల), అఖిల (ఉమెన్స్ కళాశాల), మౌనిక (ఆర్‌కే కళాశాల), అక్షిత (జీజీ కళాశాల)లు ఉత్సవాలకు హాజరయ్యారు. ఈసందర్భంగా వివిధ రంగాలకు చెందిన 13 మందిని గవర్నర్ సన్మానించారు. అనంతరం నిర్వహించిన పంచాంగ శ్రవణంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేడుకల్లో యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందని వీసీ అన్నారు. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు ధన్యవాదాలు తెలిపారు. యూనివర్సిటీ ప్రతినిధిగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సిల్వర్ మెడల్

తెయూ(డిచ్‌పల్లి): ఉత్తరప్రదేశ్‌లోని వీర్ బహదూర్ సింగ్ పూర్వాంచల్ యూనివర్సిటీ (జాన్‌పూర్)లో ఈ నెల 20నుంచి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ ఉమెన్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నీలో తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థిని ఉమ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా వర్సిటీ క్రీడావిభాగం డైరక్టర్ సంపత్ మంగళవారం మాట్లాడుతూ.. జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో తెయూకు ఇది తొలి పతకం అన్నారు. ఉమ, కోచ్ శ్రీనివాస్‌కు వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, స్పోర్ట్స్ డైరక్టర్ సంపత్ అభినందనలు తెలిపారు.

బీఈడీ పరీక్ష ఫీజు 27లోపు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు మంగళవారంతో ముగిసింది. రూ.100ల అపరాధ రుసుముతో ఈ నెల 27వరకు పరీక్ష ఫీజును చెల్లించే అవకాశం ఉందని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ సంబంధిత కళాశాలల్లో ఫీజు చెల్లించాలని ఆమె సూచించారు. వివరాలకు వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని ఆమె కోరారు.

క్రైం కార్నర్

బియ్యం లారీ పట్టివేత

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ సమీపంలో మంజీరా నది వద్ద మంగళవారం తెల్లవారుజామున పోలీసులు బియ్యం లారీని పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి బీర్కూర్ వెళుతున్న లారీలో ఉన్న బియ్యంకు సంబంధించిన ధ్రువపత్రాలను చూపనందున పోలీసులు లారీని కోటగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించగా.. సివిల్ సప్లై డీటీ అశ్వక్ ఆహ్మద్ బియ్యం శాంపిల్ సేకరించారు. ల్యాబ్‌కు పంపిస్తామని పీడీఎస్ బియ్యంగా నిర్ధారణ అయితే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నెంబర్ ప్లేట్‌లో నెంబర్ మార్చినందుకు ఓ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని సాయిరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద ట్రాఫిక్ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ వాహనాల తనిఖీలు చేస్తుండగా.. ఆటోనగర్‌కు చెందిన షేక్ ఇలియాస్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం పత్రాలను చూయించాడు. వాహనాదారుడు చూపించిన ఆర్‌సీలో టీఎస్ 07 ఈడబ్ల్యూ 2420 ఉండగా బండిపై ఉన్న నెంబర్ ప్లేట్‌పై టీఎస్ 07ఎఫ్‌డబ్ల్యూ 2420తో సదరు వాహనదారుడైన షేక్ ఇలియాస్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువులో పడి వీఆర్ఏ మృతి!



రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలోని మసాని చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన వీఆర్ఏ మృతిచెందాడు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన వీఆర్ఏ నూలు పర్వయ్య(45) మంగళవా రం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. కాలకృత్యాలకు వెళ్లి జారిపడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. పర్వ య్య మోస్రా తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల వల్ల భార్య దూరంగా ఉంటున్నట్లు సమాచారం. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిపై దాడి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పరిధిలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థి విశాల్‌పై ఒక వర్గానికి చెందిన సుమారు 30మంది దాడికి పాల్పడ్డారు. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విశాల్‌పై నిందితులు కక్ష పెట్టుకొని కళాశాల నుంచి బయటకు రాగానే ముకుమ్మడిగా దాడి చేసి, గాయపర్చారు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

ఇద్దరు నిందితుల రిమాండ్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో ఇటీవల కారు అద్దాలను ధ్వంసం చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. ఈనెల 14న గ్రామంలోని మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు వాహనాం అద్దాల ను మల్లయ్యగారి ఆకాష్, ద్యావడ రాజశేఖర్ ధ్వంసం చేశారు. దీంతో విచారణ చేపట్టి నిందితులను కోర్టుకు రిమాండ్ చేశామని ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని ఇద్దరి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సాయినాథ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఈ నెల 18న ఖిల్లా రోడ్డు వద్ద గుర్తు తెలియ ని వ్యక్తి (60) అనారోగ్యంతో పడిపోయి ఉండటంతో అతడిని స్థానికులు అంబులెన్స్‌లో గవర్నమెంట్ హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసినచో ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌ని, లేదా 87126 59727, 87126 59844 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బడాబజార్ వద్ద..



ఖలీల్‌వాడీ: నగరంలో జీజీహెచ్‌లో మంగళవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని బడాబజార్ కెనరా బ్యాంక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(60) అనారోగ్యంతో పడిపోయి ఉండగా స్థానికులు అతడిని అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు భిక్షాటన చేస్తూ జీవించేవాడని, అనారోగ్యం మృతి చెందారని మున్సిపల్ జవాన్ బుగ్గల రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు పోలీసులు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గానీ, 8712659838, 8712659715 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మెసేజ్ ఓపెన్ చేయగానే రూ.1.39 లక్షలు మాయం

లింగంపేట(ఎల్లారెడ్డి): ఓ వ్యక్తి తన మెబైల్‌లోని టెలిగ్రాంకు వచ్చిన మెసేజ్ ఓపెన్ చేసి చూడటంతో సుమారు రూ.1.39లక్షలను సైబర్ మోసగాళ్లు కాజేశారు. మండలకేంద్రంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పార్శి ప్రభాకర్ ఫోన్ నంబర్ టెలిగ్రాం యాప్‌కు ఈనెల 19వ తేదీన +85297834014 నుంచి మెస్సేజ్ వచ్చింది. నూతన నంబర్ నుంచి మెస్సేజ్ రావడంతో బాధితుడు ఓపెన్ చేశాడు. దీంతో ఆదివారం నుంచి సోమవారం వరకు బాధితుడు బ్యాంక్ ఖాతా నుంచి విడతల వారీగా రూ. 1.39 లక్షల డబ్బును సైబర్ నేరగాళ్లు తమ ఖాతాలోకి మళ్లించుకున్నారు. సైబర్ నేరగాళ్లపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

ఖలీల్ వాడి: నగరంలోని నాందేవ్‌వాడలో ఓ వ్యక్తి మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. నాందేవ్‌వాడకు చెందిన హాట్కరి కందేరావు(38), కిసాన్ గంజ్‌లో కూలీ పని చేస్తూ జీవిస్తుండేవాడు. కందేరావు మద్యానికి బానిసై, భార్యను తరుచు కొట్టడంతో, కొన్నేళ్ల క్రితం ఆమె తన ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తన తల్లి మంగళీబాయ్‌తో కలిసి నాందేవ్‌వాడలో నివసిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం భార్య కాపురానికి రావడం లేదని, మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని దూలానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



బీబీపేట: మండలంలోని జనగామ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బొమ్మెర బాల్‌నర్సవ్వ ఈనెల 17న కామారెడ్డిలోని బంధువుల వద్దకు వెళ్లి.. తిరిగి 20న ఇంటికి వచ్చింది. ఇంటి తాళాలు తీసిఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం, నగదును గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. సుమారు పన్నెండు తులాల బంగారు అభరణాలు, ఇరవై తులాల వెండి పట్టగొలుసులు, రూ. 9వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం సభ్యులు వచ్చి వివరాలు సేకరించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జిల్లాలోని 54 పరీక్ష కేంద్రాల్లో 14230 మంది విద్యార్థులు జనరల్‌లో, 1830 మంది ఒకేషన్‌లో పరీక్షలు రాశారు. జనరల్‌లో 488 మంది. ఒకేషనల్‌లో 184 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

చోరీకి యత్నించిన నిందితులకు దేహశుద్ధి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని 1వ వార్డులోగల ఓ ఇంట్లోకి మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు దుండగులు చొరబడి చోరీకి యత్నించగా.. స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని మ్యాదరి శంకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. భార్య పద్మ పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఇంట్లో కుమారుడు భూమేశ్ ఉండగా.. బైక్‌పై వచ్చిన ఒక మగ వ్యక్తి, ఆడ మనిషి ఇంట్లోకి చొరబడి భూమేశ్‌ను అరవకుండా పట్టుకుని లోపలికి తీసుకువెళ్లారు. వారినుంచి భూమేశ్ తప్పించుకుని బయటకు వచ్చి అరవడంతో కాలనీవాసులు వచ్చి, ఇంటికి గొళ్లెం పెట్టి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సదరు వ్యక్తులు బీరువాలో బంగారు నగలు తీసుకుని తప్పించుకోవడానికి సిద్ధంగా ఉండగా.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గొళ్లెం తీశారు. వెంటనే స్థానికులు నిందితులకు దేహశుద్ధి చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.